క్లుప్తంగా

కొత్త మార్కెట్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

ఒంగోలు సబర్బన్: నగరంలోని సౌత్ బైపాస్‌తో పాటు కొత్త మార్కెట్ పరిసరాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఒంగోలు టౌన్ డీఈఈ కేవీ పాండురంగారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సౌత్ బైపాస్ రోడ్డు, కొత్తడొంక, 220 కేవీ సబ్ స్టేషన్, ముంగమూరు రోడ్డు జంక్షన్, కొత్త మార్కెట్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణం వలన విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

ఒడా చైర్మన్ పదవిని యాదవులకు కేటాయించాలి

ఒంగోలువన్‌టౌన్: ఒడా చైర్మన్ పదవిని యాదవులకు కేటాయించాలని యాదవ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాదవులు అత్యధికంగా తెలుగు దేశం పార్టీకి ఓట్లు వేశారని అనుకూలంగా ఉన్నారన్నారు. జిల్లాలో టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత యాదవ నాయకులు కనుమరుగైపోయారని ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రైవేటు ఉపాధ్యాయులతో వెట్టిచాకిరి యాజమాన్యాలు



ఒంగోలు టౌన్: ప్రైవేటు ఉపాధ్యాయుల చేత ఏడాది మొత్తం పని చేయించుకుంటూ కేవలం 10 నెలల జీతాలు ఇస్తున్న యాజమాన్యాలు శ్రమ దోపిడికి పాల్పడుతున్నాయని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కేఎఫ్ బాబు విమర్శించారు. గురువారం ఎల్బీజీ భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ర్యాంకులు రావాలన్నా, బాగా అడ్మిషన్లు జరగాలన్నా అందులో పనిచేసే ఉపాధ్యాయులు, అధ్యాపకులు కష్టంతోనే సాధ్యమవుతుందన్నారు. అయినప్పటికీ ఉద్యోగ భద్రత లేకుండా గడపాల్సి వస్తుందని చెప్పారు. ప్రభుత్వ గుర్తింపు కార్డులు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు లేకుండా సంవత్సరాల తరబడి పనిచేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న టీచింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కిరణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు



కొత్తపట్నం: నవోదయ ప్రవేశ పరీక్షలో ఎంపికైన విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు. మండలంలోని మోటుమాల కేజీబీవీలో 8వ తరగతి చదువుతున్న లక్ష్మీ లాస్య నవోదయ ప్రవేశ పరీక్ష రాసింది. ఏప్రిల్ 3 విడుదల చేసిన ఫలితాల్లో లక్ష్మీ లాస్యకు సీటు రావడంతో గురువారం విద్యార్థినిని ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌వో అరుణ, ఉపాధ్యాయురాలు టి.పద్మావతి, చిన్నదేవి పాల్గొన్నారు.

32 కేజీల వెన్నతో గణపతికి పూజలు

ఒంగోలు మెట్రో: వసంత నవరాత్రుల సందర్భంగా నగరంలోని శ్రీనగర్ మొదటి వీధిలో వేంచేసి ఉన్న విజయ గణపతికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం విజయ గణపతి మూలవిరాట్‌కు సుగంధ పరిమళ ద్రవ్యాలు, పసుపు, కుంకుమ, గంధం విభూది చందనంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం 32 కేజీల వెన్నతో విశేష అలంకరణ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు.

జలవనరుల శాఖకు.. చంద్ర గ్రహణం

● ప్రారంభానికి నోచుకోని నూతన కార్యాలయం ● 90 శాతం పనులు పూర్తి ● 10 శాతం పనులు కూడా చేయని కూటమి ప్రభుత్వం


చంద్రముఖి భవనంలా మారిన నూతన భవనం


శిథిలావస్థకు చేరిన జల వనరులశాఖ కార్యాలయం

చీమకుర్తి రూరల్: కూటమి ప్రభుత్వం వచ్చాక అటు వ్యవస్థలను, ఇటు పాలనను ఎంత దారుణంగా మార్చిందో మనం చూస్తూనే ఉన్నాం. గత ప్రభుత్వంలో పాలన, సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడితే.. కూటమి ప్రభుత్వం మాత్రం కక్షలు, దాడులు, అక్రమ కేసులతో నడుస్తోంది. గత ప్రభుత్వంలో నిర్మాణంలో ఉన్న భవనాలను పూర్తి చేయాల్సింది పోయి కక్ష పూరితంగా వ్యవహరించి వదిలేసింది. ఇవే కాదు నియోజకవర్గంలోని చాలా ప్రభుత్వ భవనాలను సైతం పూర్తి చేయకుండా మీనమేషాలు లెక్కిస్తోంది. ఈ నేపథ్యంలో చీమకుర్తిలో జల వనరులశాఖ కార్యాలయం శిథిలావస్థకు చేరి కూలిపోయే దశలో ఉంది. సిబ్బంది బిక్కుబిక్కుమంటూ వారి పనులు నిర్వహిస్తున్నారు. వర్షాలు కురిసే సమయంలో కార్యాలయ సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. దీంతో రికార్డులకు భద్రత లేకపోగా తడిసి పోతున్నాయి. గత ప్రభుత్వంలో జల వనరుల శాఖకు నూతన బిల్డింగ్ ఏర్పాటు చేయడానికి వరల్డ్ బ్యాంకు నుంచి రూ.90 లక్షల నిధులు మంజూరు చేయించి 90 శాతం పనులు పూర్తి చేశారు. మిగిలిన 10 శాతం పనులు పూర్తి చేయలేని పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఉంది. పెండింగ్ పనులు పూర్తి కావడానికి ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో మిగిలిన పనులకుగాను మండల ప్రజా పరిషత్ నిధుల మంజూరు చేయాలని అడగగా, మండల ప్రజా పరిషత్ నిధుల నుంచి ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు నిధులు మంజూరు చేస్తామన్నారు. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు పెండింగ్‌లో ఉన్న భవనాలు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ భవన నిర్మాణాలపై చొరవ చూపని ప్రభుత్వం..



గత ప్రభుత్వంలో జల వనరులశాఖ భవన నిర్మాణాల శరవేగంగా సాగాయి. ప్రస్తుతం భవన నిర్మాణ పనులు ప్రారంభానికి నోచుకోలేని దుస్థితి నెలకొంది. వీటి నిర్మాణాలు పూర్తి చేసే దిశగా కూటమి ప్రభుత్వం చొరవ చూపకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. త్వరితగతిన భవన నిర్మాణాలు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలి

– సోమా శేషాద్రి కౌన్సిలర్, చీమకుర్తి

అభివృద్ధిని గాలికొదిలేసిన కూటమి



అభివృద్ధి పనులను పట్టించుకోకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. అంతేకాకుండా సంక్షేమాన్ని కూడా గాలికొదిలేసింది. అసంపూర్తిగా మిగిలిపోయిన ప్రభుత్వ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలి.

– గోపురపు పూర్ణచంద్రరావు, చీమకుర్తి

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ


చెల్లాచెదరుగా పడిపోయిన ధాన్యం బస్తాలు


రక్తపు గాయాలతో ఆసుపత్రిలో క్షతగాత్రులు

నాగులుప్పలపాడు: ట్రాక్టర్‌ను లారీ ఢీకొట్టిన ఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. ఈప్రమాదం గురువారం మండలంలోని మద్దిరాలపాడులోని 216 జాతీయ రహదారిపై జరిగింది. అందిన వివరాల మేరకు.. మండలంలోని తిమ్మసముద్రం గ్రామానికి చెందిన ధాన్యం బస్తాలతో ట్రాక్టర్ ఒంగోలు వైపు వస్తోంది. ఈక్రమంలో మద్దిరాలపాడు సమీపంలోని ఇనమనమెళ్లూరు రోడ్డువద్దకు రాగానే లారీ వెనక నుంచి ట్రాక్టరును ఢీకొట్టింది. దీంతో ట్రక్కులో ధాన్యం బస్తాలపై కూర్చున్న తిమ్మసముద్రం గ్రామానికి చెందిన ఐ అంకమ్మరావు, డి వంశీలు కింద పడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయ. క్షతగాత్రులను 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేయాలి


విగ్రహం ఏర్పాటు స్థలాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: రాజీవ్ గాంధీ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షురాలు టి నాగలక్ష్మి మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. కబాడీపాలెం జంక్షన్‌లో రోడ్డుపై తొలగించిన విగ్రహాన్ని క్లాపేట వద్ద ఏర్పాటు చేయడానికి కమిషనర్ గురువారం కాంగ్రెస్ నాయకులతో కలిసి స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో నాయకులు కె వెంకట కృష్ణారెడ్డి, పి విజేష్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలి


పొన్నలూరు పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

● ఎస్పీ ఏఆర్ దామోదర్

పొన్నలూరు: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలు, ఫిర్యాదుదారులతో స్నేహపూర్వంగా మెలగాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. సాధారణ తనిఖీలో భాగంగా పొన్నలూరు పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన సందర్శించారు. ముందుగా రికార్డులు, పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగేలా పోలీసులు పనిచేయాలన్నారు. ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా సత్వరమే పరిష్కరించేలా చూడాలన్నారు. ముఖ్యంగా ప్రజలు సైబర్ మోసాలకు గురికాకుండా చైతన్యం చేయాలన్నారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు, పేకాట, బెట్టింగ్‌లపై చర్యలు తీసుకొని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరమైన కేసులు నమోదు చేయాలన్నారు. మహిళా పోలీసులు కూడా గ్రామాల్లో, పాఠశాలల్లో బాలకలకు గుడ్ టచ్–బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించి లైంగిక వేధింపులపై అప్రమత్తంగా ఉండేలా తెలియజేయాలన్నారు. పోలీసులు సమన్వయంతో పనిచేసి మంచి వాతావరణం ఉండే గ్రామాలను తయారు చేయాలన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యల పరిష్కారంలో చొరవ చూపిన ఎస్సై అనూక్‌ను ఎస్పీ అభినందించారు. ఆయన వెంట కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, సీఐ సోమశేఖర్ ఉన్నారు.

కొండపి: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని ఎస్పీ ఏ.ఆర్ దామోదర్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ ని గురువారం సాయంత్రం ఎస్పీ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. స్టేషన్ పరిసరాలలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం స్టేషన్ పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్ కేసులపై దృష్టి సారించి త్వరగా పరిష్కరించాలన్నారు. అనంతరం మహిళా పోలీసులతో ప్రత్యేకంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందికి హెల్మెట్లు అందజేశారు. కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, కొండపి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సోమశేఖర్, కొండపి ఎస్సై ప్రేమ్ కుమార్,సిబ్బంది ఉన్నారు.

స్కోచ్ అవార్డు అందుకున్న కలెక్టర్‌కు అభినందనలు

ఒంగోలు సిటీ: బంగారు బాల్యం కార్యక్రమం నిర్వహణకుగాను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా స్కోచ్ అవార్డు అందుకున్నందుకు పలువురు కలెక్టర్‌కు అభినందలు తెలిపారు. గురువారం జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చిన్నపరెడ్డి కిరణ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి వరకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు సబర్బన్: స్కోచ్ అవార్డు అందుకున్న కలెక్టర్‌కు మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సుజన్ మాదిగ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెస్పీఎస్ ప్రతినిధులు కొలకలూరి విజయ్ కుమార్, పత్రా బంగారం, రావినూతల జయ కుమార్, మంద సుధాకర్, వంశీ, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు

భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి నవరాత్రి వేడుకలు

పామూరు: స్థానిక కాపువీధిలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి అర్చకులు కురిమేటి సాయి సీతా, రామ, లక్ష్మణ, హనుమంత మూల విగ్రహమూర్తులకు, ఉత్సవ మూర్తులకు ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఉభయదాతలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పోర్టిఫైడ్ రైస్‌లో పోషకాలు


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న రంగారావు

కొత్తపట్నం: విద్యార్థుల్లో పోషక విలువలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం పోర్టిఫైడ్ రైస్‌ను మధ్యాహ్నం భోజన పథకంలో చేర్చిందని డిస్ట్రిక్ ప్రోగ్రామ్ ఆఫీసర్ టీ రంగారావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్టిఫెడ్ రైస్‌ను విద్యార్థులు తల్లిదండ్రులకు చెప్పి తీసుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో పి.పద్మావతి, హెచ్‌ఎం ఎం.శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇమ్మడిచెరువు సర్పంచ్ మృతి

వెలిగండ్ల(కనిగిరిరూరల్): మండలంలోని ఇమ్మడి చెరువు గ్రామ సర్పంచ్ తోకల బాలకృష్ణా (34)మృతి చెందాడు. జీవనోపాధి నిమిత్తం బెంగళూరులో ఉంటున్న బాలకృష్ణా గురువారం ఆత్మహత్య చేసుకుని మృతి చెందినట్లు తెలిసింది. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. బాలకృష్ణ మృతికి వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్, జెడ్పీటీసీల సంఘ అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, ఎంపీపీ రామన మహాలక్ష్మమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు గజ్జల తిరుపతి రెడ్డి, నాయకులు సంతాపం తెలిపారు.

వైఎస్ జగన్‌ను కలిసిన కాకుమాను


జగన్‌మోహన్‌రెడ్డిని సత్కరిస్తున్న రాజశేఖర్

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార విభాగం అధ్యక్షుడిగా నియమితులైన కాకుమాను రాజశేఖర్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిలో మర్యాద పూర్వకంగా గురువారం కలిసి శాలువాతో సత్కరించారు. పార్టీలో నాపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను శక్తివంచన లేకుండా కృషి చేసి పార్టీని బలోపేతం చేస్తానని తెలియజేశారు.

మహిళలు ఉన్నతంగా ఎదగాలి


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

సంతనూతలపాడు: మహిళలంతా చదువుకొని చైతన్యవంతులై ఆర్థికంగా పురోభివృద్ధి సాధించాలని ఒంగోలు బెతూన్ నర్సింగ్ హోమ్ వైద్యులు డాక్టర్ ఎస్ ఉదయిని పేర్కొన్నారు. మహిళా ఉద్యమ నాయకురాలు మోటూరు ఉదయం 23వ వర్ధంతి సందర్భంగా మోటూరు ఉదయం ట్రస్ట్, ఐద్వా ఆధ్వర్యంలో మండలంలోని పేర్నమిట్ట పరిధిలోని పీర్లమాన్యం ఎలిమెంటరీ స్కూల్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యశిబిరంలో ఆసుపత్రి వైద్యులు ఎస్ ఉదయిని, ఎస్ సందీప్ ప్రకాష్ రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐద్వా మండల అధ్యక్షురాలు బంకా పద్మ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్ష కేంద్రం ఆకస్మిక తనిఖీ


పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రిజిస్ట్రార్ హరిబాబు

ఒంగోలు సిటీ: ఆంధ్రకేసరి యూనివర్శిటీ పరిధిలో డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షలను యూనివర్శిటీ రిజిస్ట్రార్ బీ హరిబాబు పేర్కొన్నారు. గురువారం మార్టూరులోని పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పరీక్షల నిర్వాహకులతో మాట్లాడుతూ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించి యూనివర్శిటీకి మంచిపేరు తీసుకొని రావాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో సజావుగా, సక్రమంగా పరీక్షలు నిర్వహిస్తూ ఉండటంపై హరిబాబు సంతప్తి వ్యక్తం చేశారు. వేసవి కావడంతో ప్రతి రూము వద్ద తప్పకుండా మంచినీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ప్రశాంతంగా పరీక్షలు జరుగుతుండటంతో ఆయన సంతప్తి వ్యక్తం చేశారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు


మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారిణి పావని

సంతనూతలపాడు: ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరిస్తే తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు లభిస్తాయని మండల వ్యవసాయ అధికారిని పీ పావని తెలిపారు. సంతనూతలపాడులోని వెలుగు కార్యాలయంలో గురువారం మైనంపాడు క్లస్టర్‌లో వీవోఏలు, ఎన్యూమరేటర్స్, 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జీవనోపాధుల ప్రణాళిక శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఆ మేరకు రైతులను మరింతగా చైతన్య పరచాలని ఏవో పేర్కొన్నారు. అంతేకాకుండా అధికంగా ఎరువులు, పురుగు మందులను వాడరాదన్నారు. సేంద్రియ ఎరువులను వాడాలన్నారు. జీవనోపాధుల ప్రణాళిక సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని వెలుగు ఏపీఎం టీ బాబురావు కోరారు. ఎస్‌హెచ్‌జీ సభ్యుల నుంచి రుణ అవసరాల ప్రణాళికను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ రజిత, ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ శేషమ్మ, సీఆర్పీలు, ఏఈఓలు, సీసీలు, వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.

గాజాపై దాడులు ఆపాలని నిరసన



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ఒంగోలు టౌన్: కాల్పుల ఒప్పందాన్ని ఉల్లంఘించి వైమానిక దాడులకు పాల్పడుతున్న ఇజ్రాయిల్ వైఖరి దుర్మార్గమని.. వెంటనే గాజా మీద జరుపుతున్న వైమానిక దాడులను ఆపాలని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని గాంధీనగర్‌లో ఇజ్రాయిల్ దాడులకు వ్యతిరేకంగా ఆపార్టీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు వ్యతిరేకంగా ఐక్యరాజ్య సమితి ఆదేశాలను లెక్కచేయకుండా ఇజ్రాయేల్ చేస్తున్న మారణ హోమాన్ని యావత్ ప్రపంచ దేశాలు ఖండిస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో యాసిన్, బీ రఘురాం, టీ మహేష్, బీవీ రావు, పీరు సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శాస్త్రీయ సంగీతం


గణనాథుని ప్రార్థనలో చిన్నారులు


గీతాలు ఆలపిస్తున్న చిన్నారులు

ఒంగోలు మెట్రో: చైత్రమాసం వసంత నవరాత్రుల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకుంటున్నాయి. గురువారం నగరంలోని సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో వసంత నవరాత్రుల సందర్భంగా శారద సంగీత పాఠశాల సౌమ్యలత వారి శిష్య బృందంచే శాస్త్రీయ సంగీతం ఏర్పాటు చేశారు. కార్యక్రమాలు ఆలయ కమిటీ చైర్మన్ అళహరి చెంచలరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో చిన్నారులు, తల్లిదండ్రులు స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్సాహంగా కోలాట ప్రదర్శనలు..

వసంత నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నగరంలోని నిర్మల్ నగర్‌లోని పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానం కోలాట మండలి వారిచే అద్భుతంగా కోలాట ప్రదర్శన నిర్వహించారు. సత్య సాయిబాబా బాలవికాస్ విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.